గ్యార్వీ ఉత్సవాలు



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధి ఆర్‌జీకేలోని దర్గా వద్ద శనివారం నిర్వహించిన గ్యార్వీ ఉత్సవాలకు బీఆర్ఎస్ నాయకులు జైహింద్ హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ సాజిద్, ప్రభాకర్, సయ్యద్, మోజస్, ఫిరోజ్, ఆనంద్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

అక్రమ నిర్మాణం కూల్చివేత



సుభాష్‌నగర్: సూరారం సాయిబాబానగర్‌లోని గాజులరామారం సర్వే నంబర్ 49/8 వెలసిన షెడ్డును రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. దసరా సెలవుల్లో భాగంగా కబ్జాదారులు గుట్టు చప్పుడు కాకుండా గదుల చుట్టూ ప్రహరీలు నిర్మించారు. ఏకంగా ప్రధాన రోడ్డును ఆనుకుని షెడ్డును ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీం శనివారం షెడ్డును కూల్చి వేశారు. మిగతా నిర్మాణాలు గుర్తించి త్వరలో నేలమట్టం చేస్తామని తెలిపారు.

ప్రజా ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి పెద్దపీట

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



చెక్కు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

బాలానగర్: ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ అన్నారు. శనివారం బాలానగర్‌లోని సాయినగర్ ప్రాంతానికి చెందిన పాలడుగు వెంకట కృష్ణకు రూ.8.80 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన నివాసంలో నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో చందు, వినాయక నగర్ అధ్యక్షుడు సిద్దు, లక్ష్మణ్, పుష్పారెడ్డి, మల్లికార్జున్ గౌడ్, యుగేందర్ రెడ్డి, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, మధు, రామ్మోహన్ రావు, భరత్ పాల్గొన్నారు.

నియామకం



సన్మానిస్తున్న ట్రస్టీ పాలక కార్యవర్గం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సేవా భారతి పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మోతీనగర్ ట్రస్టీగా శనివారం నియమించారు. అనంతరం ట్రస్ట్ పాలక కార్యవర్గం ఆయనను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో చైర్మన్ బి. సీతారామయ్య, వైస్ చైర్మన్‌రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, ట్రస్టీలు సీఎస్ఆర్ మూర్తి, పీఏఎస్ మూర్తి, జి. ఉమా మహేశ్వర రావు, సుబ్బరామయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లోని కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు శనివారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఎస్ఎస్ఎల్ మాల్ దగ్గర మూసివేసిన రోడ్డును తెరిచి ప్రస్తుతం ఉన్న యోగా సెంటర్ వద్ద యుటర్న్ తీసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద యూ టర్న్ ఇవ్వాలని కాలనీ వాసులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

నిరాశలో ఆశావహులు!

గ్రేటర్‌లో విలీనమా?.. మున్సిపాలిటీలుగానా?

- స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- పురపాలికలుగా మారిన జీపీలు
- ఇప్పట్లో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం లేకపోవడంతో ఆశలపై నీళ్లు
- వీటిని కూడా జీహెచ్ఎంసీలో కలుపుతారని ప్రచారం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో సెమీ అర్బన్‌గా మారిన జీపీ నేతల్లో భిన్నాభిప్రాయాలు



నిజాంపేట్: మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేస్తారా?, లేదా? ఈ దఫా అలానే ఉంచి ఎన్నికలు నిర్వహిస్తారా! అనేది అంతు చిక్కక రాజకీయ పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పదవి కాలం ముగిసి సుమారు 8 నెలలు పూర్తవుతున్న ఇప్పటి వరకు వీటిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. అందరిలోనూ అయోమయం నెలకొంది. గ్రేటర్‌లో విలీనం చేయలనుకుంటే ఆదిశగా అడుగులు వేసి ప్రకటిస్తే సరిపోతుంది. లేదా యాధావిధిగా ఉంచి నిర్వహిస్తారా అనే విషయంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తే అటు రాజకీయ పార్టీలతో పాటు ప్రజలకు సైతం ఓ క్లారిటీ ఉంటుందనేది అందరి భావన.

స్థానిక షెడ్యూల్‌తో నాయకుల్లో టెన్షన్

పల్లెల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడంతో ఒక్క సారిగా గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. ఆశావాహులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.ఇన్నాళ్లు ఎదురుచూసిన నాయకులకు ముఖాల్లో ఆశాలు రేకేత్తాయి. కానీ పట్టణాల్లో మాత్రం రాజకీయ నాయకుల ముఖాల్లో ఆశలు అడుగంటి పోతున్నాయి. మున్సిపాలీటీలకు, మున్సిపల్ కార్పొరేషన్ల పదవి కాలం ముగిసి సుమారు 8 నెలలు పూర్తవుతున్న ఇప్పటి వరకు ఎన్నికల ఊసే లేదు. కనీసం స్థానిక సంస్థల ఎన్నికలతో పాటే మున్సిపాలిటీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేస్తారని నాయకులు ఆశించారు. కానీ వీటి ఊసే లేకపోవడంతో అన్నీ పార్టీల నాయకులు ఢీలా పడ్డారు. దీంతో శివారు మున్సిపాలిటీలను, కార్పొరేషన్లలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. మేడ్చల్ జిల్లాలో మొత్తం 9 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు ఉండగా వాటిల్లో రింగ్ రోడ్డు లోపల ఉన్న మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వీటి పాలక వర్గాల పదవి కాలం ముగిసిన నాటి నుంచి సుముఖంగా ఉన్నట్లు వస్తున్న వార్తలకు బలం చేకూరుస్తుంది. ఎనిమిది నెలల నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. రింగ్ రోడ్డు లోపల ఉన్న గ్రామ పంచాయతీలను సైతం వాటి పదవి కాలం ముగిసిన తరువాత ప్రభుత్వం సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసింది.

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. అప్పట్లో కుత్బుల్లాపూర్ సర్కిల్‌తో పాటు మండల ప్రాంతంలో 11 గ్రామ పంచాయతీలు ఉండేవి. కానీ 2019లో ఈ గ్రామ పంచాయతీలను కలిపి నిజాంపేట్ కార్పొరేషన్‌గా, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలుగాను ఏర్పాటు చేసింది. దీంతో అప్పటి గ్రామీణ స్వరూపం మొత్తం మారిపోయింది. ఈ సంవత్సరం జనవరి నుంచి మున్సిపాలిటీల పాలక వర్గాల పదవి కాలం ముగిసింది. కానీ ప్రభుత్వం జీహెచ్ఎంసీలో వీటిని విలీనం చేస్తే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం స్వరూపం సైతం పూర్తి స్థాయిలో మారిపోయే అవకాశం ఉంది.

విలీనమా.. యధాతథమా..!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లు జీహెచ్ఎంసీని ఆనుకుని ఉన్నాయి. అయితే వీటిని జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారా? లేదా మున్సిపాలిటీలుగానే కొనసాగిస్తారా? అనేది మాత్రం అంతు చిక్కడం లేదని వివిధ పార్టీల నాయకులు వాపోతున్నారు. అధికార పార్టీ నాయకులకు సైతం ఈ విషయం స్పష్టత లేకపోవడంతో అంతట తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఒక వేళ జీహెచ్ంఎసీలో విలీనం చేస్తే వచ్చే సంవత్సరం జీహెచ్ఎంసీ పదవి కాలం ముగిసిన తరువాతే గ్రేటర్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీలకు, కార్పొరేషన్‌లను విలీనం చేసిన తరువాత డివిజన్ల విభజన అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది అని అనాధికారి పుకార్లు సైతం వినిపిస్తున్నాయి. అయితే అలా కాకుండా ప్రభుత్వం యదాతథంగా కొనసాగించాలనుకుంటే ప్రస్తుతం జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తియిన వెంటనే ఈ మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలు సైతం లేకపోలేదు. ఏది ఏమైన ప్రస్తుతానికి మాత్రం నాయకుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

డివిజన్ల సంఖ్య తగ్గే అవకాశం

ప్రస్తుతం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లల్లో 33 వార్డులు, కొంపల్లి మున్సిపాలిటీలో 18, దుండిగల్ మున్సిపాలిటీలో 28 వార్డులు ఉన్నాయి. అయితే ఒక వేళ ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే డివిజన్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. జీహెచ్ఎంసీలో ఒక్కో డివిజన్‌కు ఎన్ని వేల మంది ఓటర్లు లెక్కలోకి తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. దీంతో డివిజన్ల సంఖ్య తగ్గి నాయకుల మధ్య తీవ్ర పాటీ నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మున్సిపాలిటీలుగా కొనసాగితేనే ఆశావాహులకు ఎక్కువ మందికి పదవులు లభించే అవకాశాలు ఉంటాయి. కానీ జీహెచ్ఎంసీలో విలీనం అయితే కొందరికే పదవులు దక్కే పరిస్థితులు ఉంటాయి.దీంతో అన్ని పార్టీల్లో నాయకుల మధ్య తీవ్రమైన పోటీతో విభేదాలు సైతం తలెత్తే ప్రమాదం లేకపోలేదు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

ఎమ్మెల్యే వివేకానంద్



పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో 'ఇస్మాయిలీ సివిక్' ఆధ్వర్యంలో ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరంలో 400 మంది పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా ఈ ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఇస్మాయిల్ సివిక్ సంస్థకు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత, బీఆర్ఎస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు జంగా కుమార్, సంగీతా రెడ్డి, వేణు యాదవ్, ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ అధ్యక్షుడు ఇక్బాల్ మందని తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్!



జీడిమెట్ల: ఇండస్ట్రీయల్ రోడ్డులో నిరంతరం వాహనదారులు పార్కింగ్ చేస్తుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పెద్ద ట్రక్కులను డ్రైవర్లు పారిశ్రామిక ప్రాంతం రోడ్లలో పార్కింగ్ చేస్తున్నారు. జీడిమెట్ల ఫేజ్1 నుంచి ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీకి వెళ్లే రోడ్డులో కొన్ని నెలలుగా రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు పడతున్నారు. రెండు వైపుల నుంచి వాహనాలు వచ్చిన క్రమంలో వాహనాలు ఎటు వెళ్లలేక సతమతం అవుతున్నారు. 20 ఫీట్లు ఉన్న రోడ్డులో వాహనాలు 200 మీటర్ల మేర నిలుపుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇండస్ట్రీయల్ ఏరియాలో ఇతర రాష్ట్రాల నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపై వాహనాలు నిలుపుతున్నారు. ఇలా అధికారులు పట్టించుకుని వాహనాలు రోడ్లపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

అధ్వానరోడ్లు.. ఎన్నాళ్లీ అవస్థలు!

రంగారెడ్డినగర్: పలు బస్తీలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రోడ్డు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ ప్రధాన రోడ్డు మీదుగా నందానగర్, విజయనగర్ కాలనీ, భగత్‌సింగ్‌నగర్‌లకు ఆయా బస్తీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గాంధీనగర్ కమిటీ హాల్ దాటిన తర్వాత ఈ రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల గాంధీనగర్, విజయనగర్ కాలనీల్లోని అంతర్గత రోడ్లు వేసిన అధికారులు ప్రధాన రోడ్డు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహంచడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న గాంధీనగర్ నుంచి విజయనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు మార్గం

రోడ్లపై పారుతున్న మురుగు



- దుర్వాసనతో వాహనదారులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

జీడిమెట్ల: రోడ్డుపై మురుగునీరు పారుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జి సమీపంలో 15 రోజులుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు నిలిచింది. వాహనదారులు వెళ్లే క్రమంలో మురుగునీటిలో నుంచి వెళ్లాల్సి వస్తుందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్ పడినప్పుడు వాహనదారులు మురుగునీటిలోనే ఉండాల్సి వస్తుంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది పట్టించుకుని మురుగునీరు సాఫీగా వెళ్లేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

ముగ్ధా షోరూం ప్రారంభించిన ప్రముఖ నటి

కూకట్‌పల్లి: ముగ్ధా 2.0 కేపీహెచ్‌బీ కాలనీలో బ్లాక్ బస్టర్ చిత్రం ఓజీ ప్రముఖ నటి ప్రియాంక మోహన్ ముగ్ధా వ్యవస్థాపకురాలు శశి వంగపల్లితో కలిసి శనివారం పునఃప్రారంభించారు. అసాధారణమైన డిజైన్‌లు, తాజా ట్రెండింగ్ చీరలు, ప్రత్యేకమైన చేనేత చీరలు అందుబాటులో ఉన్నాయని, సరసమైన ధరలతో అందజేస్తున్నామని నిర్వాహకురాలు తెలిపారు. ప్రతి రూ.50 వేల కొనుగోలుపై రూ.10 వేల విలువైన షాపింగ్ అదనంగా అందిస్తున్నామని తెలిపారు.



ప్రమాదాలకు నిలయంగా కూలిన చెట్టు

చింతల్: వర్షాకాలంలో కూలిన చెట్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. చింతల్ లాస్ట్ బస్ స్టాప్ నుంచి జీడిమెట్లకు వెళ్లే నర్సాపూర్ రాష్ట్ర రహదారులు హెచ్ఎంటీ వనంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఓ భారీ వృక్షం ఎండిపోయి నేలకొరిగింది. ఈ చెట్టు పెద్దకొమ్మలు ప్రధాన రహదారికి ఆనుకొని పడటంతో వాహనదారులకు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగంతో వచ్చే వాహనాలు ఈ భారీ చెట్టుకొమ్మలను గమనించి స్పీడును కంట్రోల్ చేసే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



నాలా పైకప్పుపై కారు షెడ్డు!

రంగారెడ్డినగర్: నాలా ప్రాంతాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్ గణేశ్ ఆలయం ఎదురుగా ఉన్న బాక్స్ నాలా వెళ్తోంది. అయితే స్థానికంగా ఉన్న కొందరు ఇళ్ల యజమానులు నాలా శ్లాబ్ ప్రాంతాన్ని తమ సొంత జాగీరుగా వినియోగిస్తున్నారు. నాలా శ్లాబ్‌పై షెడ్డును ఏర్పాటు చేసి కార్ల పార్కింగ్ కోసం ఉపయోగిస్తున్నారు. అధికారులు స్పందించి నాలా దెబ్బతినకుండా సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.



ప్రణాళికలు ఒక విధంగా ..పనులు మరో విధంగా!



రాడ్డు ఏర్పాటు స్థానంలో చెట్టుకు కట్టి...

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో అధికారుల తీరు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఓ ఆర్టిజన్ చొరవతో అక్రమాలకు తెర లేపుతున్నారు. అధికారి కనుసన్నల్లో జరుగుతున్న ఈ తతంగంతో విద్యుత్ శాఖ ఆదాయానికి గండిపడుతుంది. ఎస్సార్ నాయక్‌నగర్ అపురూప కాలనీ ఫీడర్ పరిధిలో ఓ బిల్డింగ్ యజమాని నిర్మాణం చేస్తుండగా పాత పోల్స్ కేబుల్ షిఫ్టింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఎస్టిమేషన్ రూపొందించిన అధికారులు ఆ దిశగా పనులు చేయకుండా కేబుల్ లాగడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రణాళికలు ఒక విధంగా.. పనులు మరో విధంగా జరగడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఒక పోల్ శాంక్షన్ ఉంటే రెండు పోల్స్‌కు కేబుల్ లాగడమే కాకుండా.. సపోర్టు వైరు కోసం రాడ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా చెట్టుకు కట్టి చేతులు దులుపుకోవడం విశేషం. ఇంటి యజమాని ఎల్టీకి సంబంధించిన పోల్స్ కేబుల్ మార్చాలని కోరగా.. హెచ్‌పీ కేబుల్ లాగడంతో విద్యుత్ ఆదాయానికి గండి పడినట్లు అయ్యింది. అంతేకాకుండా ఎర్తింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. ఓ అధికారి లోపాయికారి ఒప్పందం ద్వారా డబ్బులు జేబులో వేసుకొని.. పాత విద్యుత్ స్తంభానికి కేబుల్ గుంజి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా చేయడంపై పలువురు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇదే విషయంపై షాపూర్‌నగర్ ఏడీఈ వీరేశలింగంను సాక్షి వివరణ కోరగా.. ఈ విషయంపై ఇప్పటికే సమాచారం ఉందని, ఫీల్డ్ విజిట్ చేసిన తర్వాత సంబంధిత ఆర్టిజన్, ఏఈ లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలితే ఎంతటివారైనా చర్యలు తప్పవన్నారు.

ఆగుతూ.. సాగుతూ..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నత్తనడకన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- మొత్తం వచ్చిన దరఖాస్తులు 1.47లక్షలు
- మొదటి విడతలో 1,775 మందికి మంజూరు
- నిధుల విడుదల జాప్యంతో నెమ్మదించిన పనులు
- పూర్తయినవి 25 గృహాలు మాత్రమే
- బేస్‌మెంట్ లెవల్‌లో 624, రూఫ్ లెవల్‌లో 284



సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదల్లో జాప్యం.. పలు సాంకేతిక సమస్యల నేపథ్యంలో చాలావరకు పునాది దశల్లోనే దర్శనమిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం 1.47 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నా.. ఇందులో స్థలం లేని వారే అధికంగా ఉండడంతో మొదటి విడతలో 1,775 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేశారు. ఇప్పటివరకు బోడుప్పల్ పురపాలక సంఘంలో 118 ఇండ్లు, దమ్మాయిగూడలో 128, ఘట్‌కేసర్‌లో 149, గుండ్ల పోచంపల్లిలో 20, జవహర్‌నగర్‌లో 139, మేడ్చల్‌లో 280, ఎంసీపల్లిలో 253, నాగారంలో 112, పీర్జాదిగూడలో 75, పోచారంలో 82, తూంకుంట పురపాలక సంఘంలో 55, మేడ్చల్ మండల పరిధిలో 151, శామీర్‌పేట మండలంలో 204 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో బేస్‌మెంట్ దశలో 624 ఇండ్ల నిర్మాణం కొనసాగుతుండగా, రూఫ్ లెవల్‌లో 284, మార్కింగ్ లెవల్‌లో 905 ఉన్నాయి. మిగతావి చివరి దశలో ఉన్నప్పటికీ, ఫినిస్సింగ్ పూర్తయిన ఇండ్లు మాత్రం 25కు మించకపోవడం గమనార్హం.

నిబంధనలే ప్రతిబంధకం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలంటే షరతులు ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ఫలితంగా నిర్మాణంలో జాప్యం.. నిధుల విడుదల్లో ఆలస్యం జరుగుతోందన్న అభిప్రాయాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 400-600 లోపు చదరపు అడుగుల ఫీట్లు (45-65 గజాలు) స్థలంలోనే ఇల్లు నిర్మించాలి. అన్ని సౌకర్యాలతో అనుకూలంగా నిర్మించుకునేందుకు దశలవారీగా ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది.

పనుల వేగవంతంపై దృష్టి.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పీడీ కలిసి నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. వార్డు ఆఫీసర్, కమిషనర్, మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహిస్తూ పనులు ఊపందుకునేలా చర్యలు తీసుకుంటోంది.

స్థలం లేకున్నా.. ఇండ్ల కోసం దరఖాస్తు

జిల్లాలో వలస కుటుంబాలు అధికంగా ఉన్నాయి. బతుకుదెరువు కోసం తెలంగాణలో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అద్దె ఇండ్లలో నివాసముంటున్న వలస కుటుంబాలతోపాటు జిల్లాలోని 16 పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపల్ సర్కిళ్లలోని స్లమ్ ఏరియాలు, గుడిసెవాసుల కాలనీలు, గ్రామిక ప్రాంతాల్లో ఉంటున్న చాలామంది నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే 1.47లక్షల దరఖాస్తులు అందాయి. అయితే వీరిలో చాలామందికి నివాస స్థలాలు లేకపోవడంతో ఇండ్లు మంజూరు చేయడం అధికార యంత్రాంగానికి పెద్ద సమస్యగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఇందులో అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై మున్సిపల్ కమిషనర్లు కసరత్తు చేస్తున్నారు. ఎంపిక తర్వాత..అక్కడే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకునేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. రెండో విడతలో భాగంగా 1,725 ఇండ్లు మంజూరు చేసేందుకు లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున 17,500 ఇండ్లు మంజూరు కానుండడంతో.. ప్రస్తుతం మంజూరు చేసిన 1,775 ఇండ్లు మినహాయించి మిగతా వాటిని గుర్తించిన స్లమ్ ఏరియాల్లోని అర్హులకు కేటాయించి రీ-డెవలప్‌మెంట్ పథకం కింద వారికి అక్కడే (పాత నివాసం స్థానంలో) ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కార్యక్రమాలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుడుతోంది. ముఖ్యంగా పురపాలక సంఘాలు ఈ బాధ్యతను నిర్వర్తించేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

పూర్తయినవి 25 మాత్రమే..

జిల్లాలో 1,775 ఇండ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 25 ఇండ్లు మాత్రమే పూర్తి కాగా, మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పూర్తి అయిన వాటికి ఆర్థిక సాయం పూర్తి స్థాయిలో అందగా, వివిధ దశల్లో ఉన్నవాటికి ప్రతీ సోమవారం అందజేస్తున్నారు.